శ్యామల, సుందరుడు

"దేవి"

సముద్ర తీరాన వున్నదా చిన్నపల్లె. ఆ వూరికంతా వుండేవి పదే సంసారాలు. అంతా బీదవారే. రెక్కలాడితే డొక్కలు లేవాలి. గోపరాజు, రామరాజు యిరుగు పొరుగు వారు. చీకు చింతాలేని చిన్న సంసారులు. గోపరాజుగారి అబ్బాయి పేరు సుందరుడు. రామరాజుగారి అమ్మాయి శ్యామల. గోపరాజు రామరాజును తమ్ముడూ అనేవాడు. శ్యామల సుందరుని "అన్నయ్యా" అనేది. రామరాజు వ్యాపారి. గోపరాజు కర్షకుడు. బస్తీకి బోయినపుడు రామరాజు శ్యామలకు పూలు, రంగు రంగుల గాజులు దెచ్చేవాడు. సుందరుని దీసికొనిపోయి బస్తీతమాషలన్నీ జూపేవాడు. పంటలు వచ్చినపుడు రామరాజు శ్యామలకు రెండు కట్టల ధాన్యం బహుమాన మిచ్చేవాడు. ఆ ధాన్యము అమ్మిన డబ్బుతో బొమ్మల పెళ్ళి మహోత్సాహంగా జేసేది శ్యామల. శ్యామలా సుందరులు కలిసి బడికిపోయే వారు. పంతులు దండిస్తే యిద్దరు యేడ్చేవారు. వారికావూరి పిల్లలతో స్నేహములేదు. వారికి నేస్తాలు కొన్నిపిట్టలు, గులాబి, మల్లిపొదలు.

ఇంత చక్కని సంసారాలకు తిప్పలొచ్చాయి. విషజ్వరాలు పల్లెప్రజలను సర్వనాశము జేశాయి. శ్యామలతండ్రి చనిపోయాడు. గోపరాజు మంచమెక్కాడు. శ్యామల తల్లికి దూరదేశంలో అన్నదమ్ములున్నారు. చెల్లెలి దుస్థితి జూచి వారు ఆమెను తమ యింటికిరమ్మన్నారు. ఉన్న ఆ కాస్తడబ్బు వారిచేతికేయిస్తే బిడ్డనుపెంచి పెద్దదాన్ని జేసి ఒకరిచేతుల్లో బెట్టేవూచి వారిమీదనే యుంటుందని గోపరాజుగారి సలహా వేడింది శ్యామల తల్లి. మంచి మాటే నన్నాడు గోపరాజు. వియోగబాధ ఆ రెండు సంసారాల నావరించింది కాని యెడబాటెరుగని ఆ పాపలకు భరించరానిదైనది. శ్యామల వెళ్ళి పోతుందని సుందరుడు. సుందరుని విడిచి వెళ్ళాలని శ్యామల బెంగెట్టుకున్నారు.

ఇసుక తిన్నెమీద అంతా గూర్చొని శ్యామలాసుందరులిలా మొదలెట్టారు ప్రయాణము దగ్గరపడగా. "చెల్లీ యెప్పుడు వస్తావు?"

"నాకేం దెలుసు అన్నయ్యా? ఒక్క పది రోజులుండి వచ్చేయమూ?

"ఏమో?"

"అన్నయ్యా, నీవు నాకొరకు బెంగెట్టుకోకేం. నేను ఎప్పుడూ నిన్నే తలచుకొంటూ ఆడుకుంటూ. మరి నిన్నెప్పుడు మరిచి పోను. నీవు కూడ నన్ను జ్ఞాపకముంచుకొంటావా?"

"చెల్లీ నీవు లేక పోతే మన పిట్టలు చచ్చిపోతా యేమోనని భయమేస్తున్నది. గులాబి మొక్కలు, వల్లెలు నీవు లేక పోతే బెంగెట్టుకోవు? పిన్ని వాళ్ళ అన్నలతో బోతుంది. నీవు యిక్కడ నీ అన్నయ్యాదగ్గనే వుండిపోరాదు" శ్యామలకీమాట బాగా నచ్చింది. అమ్మ వాళ్ళ అన్నయ్యలతో పోతే తనూయెందుకు బోవాలి?

ఒక్క పరుగులో యిల్లుజేరింది శ్యామల. తన వేదాంతం ప్రసమ్మరించింది.

"సుందర అన్నయ్య యేడుస్తున్నాడే అమ్మా. నేను రాను. మీ అన్నలవూరు నీవుపోవే. నేను మా అన్నఊళ్లో ఉంటాను. పిట్టలు యేడుస్తాయి. నేనురానే" అని చెప్పే కూతుర్నిజూచి యేడవాలో నవ్వాలో తెలియలా ఆమె తల్లికి.

"పిచ్చి తల్లీ! నీవులేకుంటే నేనేమిగాను? నేను చచ్చిపోనూ! సుందరునికి నేను జెబుతాలే. త్వరలో మనము వచ్చివేస్తాముగా, ఏడవకు మరి" అని నచ్చ చెప్పింది సీతమ్మ. అమ్మ మాటలు అర్థంజేసుకున్నది శ్యామల.

శ్యామల వెళ్ళి పోతున్నదని పిట్టలకంతా జెప్పేశాడు సుందరుడు. శ్యామల తన పెంపుడు మొక్కలకంతా నమ

స్కారాలు జెప్పింది. సుందరుడి దగ్గర సెలవు తీసికొని వచ్చింది శ్యామల.

"అన్నయ్యా నువ్వు చదువుకొని పెద్ద ఉద్యోగం జేస్తావని అమ్మ జెబుతుంది. నాకు కావలసినంత డబ్బుయిస్తావా? నాకు యేసహాయం గావల్సినా నిన్నే అడుగుతా, చేసి పెడతావా?"

"తప్పక జేస్తా చెల్లీ. నీ కొరకని పెద్దచదువుచదివి డబ్బు సంపాదిస్తాను"

"మరి నువ్వు నాకోసం యేడ్వనని ఒట్టువేసుకో."

"ఏడ్వను."

"మరి నేను వెళ్ళిరానా అమ్మ పిలుస్తున్నది"

"చెల్లీ నన్ను నీవు మరచిపోకుండా నా చిన్నిబొమ్మను యిస్తాను. నీవు దీనిని పారేశావా నన్ను మరచి పోయినట్లే"

శ్యామల మేనమామలతో వెళ్ళిపోయింది. ఏమి తోచక సుందరుడు వాళ్ళమ్మదగ్గరే దిక్కుముఖంవేసి కూర్చున్నాడు పుట్టిననాటనుంచి యెనిమిది సంవత్సరములు ఒక్క రెమ్మకు బూచిన రెండు గులాబులవలె ఆడిపాడిన తననేస్తం ముక్కుముఖము తెలియని బస్తీకి వెళ్ళి పోయింది. పిట్టలకు మేత బెట్టుటకు యిసుక గుట్టవద్దకువచ్చి పిలిస్తే శ్యామల నేస్తాలైన పిట్టలు దగ్గరకు రాలేదు. శ్యామల బస్తీవెళ్ళి పోయిందని యిహ మీదట వాటికి గింజలు తనే వేయాలని వచ్చితిని పొమ్మని యెన్నివిధాల జెప్పినా అవి వినిపించుకో లేదు. పిట్టల యేడుపు విన్న సుందరుడు బావురు మన్నాడు. శ్యామల పెంచే మొక్కలకు నీళ్లు బోశాడు. మరునాడు శ్యామల పిట్టలు మేతదినలేదు. సుందరుడు యిన్ని రోజులు శ్యామలతో పిట్టలతో ఆడేవాడేగాని యితర బాలురతో స్నేహంలేదు. పిచ్చివాడిలా దిరిగేవాడు. కొడుకు దిగులు జూచి వాళ్ల అమ్మకుగూడ యెంతో బెంగగా వుండేది.

ఒకనాడు సుందరుడు అమ్మదగ్గ కూర్చొని మొదలెట్టాడు. "అమ్మా, చెల్లాయి యీ వేళకు యేం జేస్తుంటుందే?"

"ఎప్పుడు చెల్లాయి మాటేనటరా? అన్నము దినడము లేదు, చదువు కోవడములేదు, దుస్తులు చూడు యెలా మాసి పోయాయో! నీవు యిలాగే యుంటే చెల్లాయికి వ్రాయిస్తాను నీవు యేడుస్తున్నావని"

"నేను యేడ్చానేమిటే అమ్మా? ఏడువనని చెల్లెకి ఒట్టువేశాను అందువలననే యేడువలేదు. మరి అబద్ధాలు గూడ వ్రాస్తావా?"

"లేదు తండ్రి, నీవు ఆడుచు పాడుచుంటే యేమి వ్రాయను. నీవు చదువుకొని పెద్దవుద్యోగివైతే చెల్లికి కావలసినన్ని చీరలు సారెలు బెట్టవచ్చు"

కొన్ని సంవత్సరాలు కాల గర్భంలో దొర్లి పోయినవి. శ్యామల యువతి. సుందరుడు యువకుడు. దూరదేశంలో నున్న శ్యామల తల్లి సుందరుని తల్లిదండ్రుల క్షేమ సమాచారాలు దెలుపుచుండేడిది. పెద్ద వుద్యోగస్థుడైతే కావలసినంత డబ్బు చెల్లాయికి సహాయపడవచ్చు. ఈ ధోరణిలో బడి సుందరుడు చదువుతో హతమతమై పోతున్నాడు.

కాలమొక విధముగా నడవదు. శ్యామల వెళ్ళినదేశంలో దుర్భరమైన కరువు వచ్చుటవలన తల్లీ బిడ్డల పోషణ పేదవారైన అన్నదమ్ములకు భారమనిపించింది. బంధుజనానికి దూరమైపోతే పిల్లకుమంచి సంబంధము దొరకదని సీతమ్మ శ్యామలను తన అక్కగారివద్ద విడిచి, తను సుందరుని ఊరు జేరింది. సుందరుని తండ్రి మరణించాడు. తల్లికితోడు పిన్నివచ్చినది గదాయని సంతోషించాడు సుందరుడు.

"శ్యామల రాలేదేమి పిన్నీ?"

"నేనే విడిచివచ్చాను నాయనా. శ్యామల నీవుజూచిన యెనిమిది సంవత్సరాల బాలికగా దిప్పుడు. నీలాగే పెరిగి పోయినది. పెళ్ళిజేయవలసిన రోజులుగదా. నాతో యీ దేశంవస్తే యిక్కడ మనమేమి తిప్పలు బడగలం? బరువు భారము మా అక్కయ్య మీదవేసి పిల్లనొకింటి దానిని జేయమని చెప్పివచ్చాను"

"చెల్లీ, శ్యామల సుందరుని జ్ఞాపకముంచుకొనియున్నదా? తన చదువేమో, శ్యామల కబుర్లేమో దప్ప ఒక్కవిషయము పట్టించుకోడు సుందరుడు చిన్ననాటి నేస్తాలను జూచాను గాని యింత వెఱ్ఱిబాగుల వానిని జూడలేదు" అన్నది సుందరుని తల్లి.

"అది పూర్వజన్మ ఋణానుబంధము దప్పవు రేమిగాదు! 'ఆడపిల్లవమ్మా, ఎప్పుడు ఒక పురుషుని గురించి చెబుతుంటే యెవరైనా వింటే బాగుండదు. పెళ్ళిగావలసిన దానవు' అని శ్యామలతో నేను పలికితినా బిక్క ముఖంవేసి అన్నయ్య దగ్గరనుంచి లాక్కొచ్చావు. ఈ కంపు ఊరిలో నన్ను ఖైదీని జేశావు. నన్ను అన్నయ్యను గురించి చెప్ప వద్దంటావేమే, అంటుంది

"మా బంగారు తల్లి బస్తికి వెళ్లినదన్నమాటేగాని దాని ప్రాణాలన్ని యీ పల్లెలోనే యున్నవన్నమాట" అన్నది సుందరుని తల్లి.

"పిన్నీ శ్యామలకు యెప్పుడు పెళ్ళి?"

"పేదవారి పెళ్లి అంతత్వరగా అవుతుందా నాయనా?"

"బంగారు చిలుకవంటి నా తల్లికి సంబంధాలు రాక పోతే మరెవరికౌతుంది సీతమ్మా పెళ్లి! దానికేమి లోపమని నీవంతగా బెంగెట్టుకుంటావు?"

"నీకేమమ్మా, నిక్షేపంలా బంగారు తండ్రిని గన్నావు. మా అవస్థ నీ కేలాగు దెలియును. పిల్ల చక్కనిదైతే సరి పోయిందా? కట్నంమాట వున్నదిగా!"

"మాయ దారి కట్నాలు. మరిదిబోతూ యిచ్చిపోయినది భుక్తికే సరిపోయి యుంటుంది. చెల్లెలి పెళ్లి సుందరుడే జేయాలి. ఏంత మిగిల్చావు చెల్లెలి పెళ్లికి?"

"కర్షకులేమి మిగిలిస్తారే? నాకున్న ఆస్థిలో చెల్లెలికి నాకు సమభాగాలు. మంచి సంబధం కుదిరితే మొత్తము మూడెకరాలు చెల్లికిచ్చి నేను బస్తీలో వుద్యోగం జేస్తాను"

"నీ బిడ్డలకు యేమి యిస్తావు?"

"పిన్నీ నాకు బిడ్డలువద్దు, పాపలు వద్దు. చెల్లి బిడ్డలకు గావలసిన విద్యా బుద్ధులు నేలేకుంటే సమంగా జరుగవు. వాళ్ళనుబెంచి పెద్దవారిని జేసేసరికి నేను ముసలివాడ నౌతును."

"ఇవేమి మాటలు సుందరా? బికారివై పోతానంటు న్నావు? ప్రశాంత జీవితాని కలవాటుబడ్డ నీవు ఆ పాడు బస్తీకిపోయి ఒకరి ముందు చేతులు జోడించుకొని నుంచుం టావా?"

"మరి శ్యామలకు పెళ్ళి యెలాగౌతుందే?"

"శ్యామల నెవరికో ఒకరికిచ్చి పెండ్లి జేస్తాను. బస్తీలలో పెద్ద పెద్ద సంబంధాలకు ప్రాకులాడితే నిన్ను బికారిని జేయాల్సినదే. ఇక్కడే మనలాగే కూలినాలి జేసుకునే వానికిస్తే శ్యామల ప్రాణం లేచివస్తుంది. నీవు ఒంటరివాడవై స్వగ్రామం విడిచిపోవ నవసరములేదు."

"అది కాదు పిన్నీ"

"జవాబు జెప్పకు సుందరా. ఇప్పటికే ఒక పెద్ద తప్పు జేశాను నాయనా. అన్నా చెల్లెండ్రను వేరుజేసి దుఃఖ పెట్టాను. అది చాలదని నిన్ను బికారిని జేయమంటావా? నీవు అలా ఉద్యోగాలకు పరపంచలు ప్రాకుచుంటే శ్యామల సుఖపడుతుందా? నీవు ఒకింటివాడవైతే రెండు సంసారాలు యిక్కడే హాయిగా వుండొచ్చు"

"నేను యెలాగు పెళ్లిజేసుకోను పిన్నీ. శ్యామల సంర క్షణ ఒకరు దీసుకొన్నా ఆమె బిడ్డల సంరక్షణ నేదీసు కోవాలి"

"చదువుకున్నవాడవు, నీకు నేను నచ్చ జెప్పగలనా? శ్యామలను రానీ. ఆమె యెలాగైనా నీ బుద్ధి మారుస్తుంది. ఆమెవద్దంటే అలాగే బ్రహ్మచారివై యుండువులే"

శ్యామల తల్లిలోని మార్పుకంతా మురిసి పోయారు. ఉత్తరం అంది శ్యామల బయలు దేరినది. ఒక చిన్ననావలో తనువస్తున్నట్లు మూడవరోజు పదిగంటలకు రేవులో పడవ చేరును గాబట్టి సుందరుని బంపమని జాబు వ్రాసింది.

మూడురోజులు మూడు యుగాలుగా గడిచాయి సుంద రునికి. చిన్ననాటి స్నేహం తిరిగి వస్తున్నది. తెల్లవారక మునుపే లేచి సుందరుడు సముద్రతీరానికి జేరుకున్నాడు. ఎన్నో పుస్తకాలు జదివినాడు ఆమె లేని యీ యెనిమిది సంవత్సరాలలో. చెల్లికి చదువువచ్చు. ఇద్దరు హాయిగా సముద్రపు యిసుకలో కూర్చొని మరల అన్ని పుస్తకాలు చదువవచ్చు. చెల్లాయివస్తే మరల పిట్టలన్నీ వస్తాయేమో. సుందరుని మెదడులో ఊహాలు పరుగెత్తుచున్నవి. ఊహాలలో మునిగిన సుందరుని తలమీద చల్లనినీడ బడినది. తలెత్తి చూచాడు. ఒక్క మబ్బుతునక విలాసంగా ఆకాశ పథాన విహరిస్తున్నది. నీలాకాశాన అందాలు చిదిమే మేఘ కుమా

తుని జూచి తన చెల్లెలుగూడ వడివడిగా యింటికి తేలివచ్చే స్తున్నదిగదా అని అనుకొంటున్నాడు సుందరుడు. ఇంతలో మబ్బుతునకలు ఒకటి, రెండు, మూడూ లెక్కకు మించి పెరిగిపోయాయి. నలుదిక్కుల నడ గొండలవలె వ్యాపించి ప్రళయగర్జన జేశాయి. సుందరుని మనస్సు ఝల్లుమన్నది. వారు మబ్బులకుదోడు వచ్చాడు వాయుదేవుడు. హోరు మని సముద్రము మీదనుంచి గాలి బయలు దేరడము జూచి సుందరుడు తల్లడిల్లి పోయాడు. "దేవ దేవా! దయామయా! నా చెల్లెలిని భద్రంగా దరిజేర్చు. ఇంతవరకు ఆ మొజాడేలేదు. తుపానును నీ జటాజూటములో మరికొన్ని గంటలుదాచు. దీనబాంధవా రక్షించు" అని యేమేమో మ్రొక్కుచున్నాడు సుందరుడు.

ప్రొద్దునబోయిన బిడ్డడు యిల్లుచేరలేదేమి చెప్పుమాయని యింటివద్ద తల్లులు యిరుగు పొరుగువారిని జేరబిలిచి సముద్ర తీరానికి బంపిరి. వారువచ్చి సుందరునిచూచి జాలి చూపులతో సముద్రమువైపు జూచుచుండిరి. ఇంతలో సముద్రము మీద యేదోనల్లగా సుందరునికి గనుపించినది. పెద్ద పెద్ద చినుకులతో వర్షమారంభమై సముద్రములో భయంకర కెరటాలను రెచ్చగొట్టుచున్నది. వర్షము హెచ్చి సముద్రఘోష పెరిగి పోతున్నకొద్దీ ఆ చిన్న నల్లని వస్తువు, తెరచాపలు స్పష్టంగా కనుపించాయి. తన ప్రాణసమానమైన చెల్లెలిని దెచ్చేపడవ అదేనని నిర్ణయించుకున్నాడు. సుందరుడు. కెరటాల తాకుడుకు పడవ ఆకులా అల్లలాడి పోతున్నది.

"అమ్మో, చెల్లీ జాగ్రత్త, భయపడకు, భగవంతుడు దయామయు"డంటూ పిచ్చికేకలువేస్తు తిరిగే సుందరుని అమాయిక ప్రేమనుజూచి అక్కడివారంతా అతనిని భయపడవద్దని ధైర్యము జెప్పుచు దేవుని స్మరించుచూ నిలబడ్డారు.

పెనుగాలిహోరు హెచ్చిన కొలదీ తల్లుల మనస్సు లాగలేదు. వారు సముద్రమునకేసి బయలుదేరిరి. కెరటాలవడికి తేలిపోతు పడవకొట్టుకొని వచ్చుచుండెను. ఇంకా ఒక్క మైలు గడచితేగాని పడవలోని వారు బయటుబడరు. సరంగుగాని తెడ్లువేయువారుగాని యెవ్వరు గనుపించడము లేదు. ఒక స్త్రీమూర్తి దరీ త్రోవలేక కెరటాల వూపులకు తేలి పోయే ఆపదలోనుంచి చేతులెత్తి రక్షించమని వేడుకోవడం జూచాడు సుందరుడు. శ్యామల రూపును పోల్చుకో లేక పోయినా ఆమె శ్యామలయై యుండవలెనని ఊహించాడు. జీరాడే చీరతో, ఎగిరి పోతున్న జుట్టుతో ఆ మూర్తి నిస్సహాయయై చేతులెత్తి మ్రొక్కుచున్నది. ఆ దృశ్యము జూచిన సుందరుని హృదయం ద్రవించి పోయింది. సోదర ప్రేమ ఒక్కమారు విజృంభించినది.

"తాతా నేనువెళ్లి చెల్లెలిని దీసికొనివస్తాను. పడవ మునిగి పోయేలాగున్నది"

"తొందరపడకు నాయనా. ఆ భయంకర సముద్రుడు నిన్ను భద్రముగా మరల రానిచ్చునా? కెరటాలు మహాభీభత్సంగా వున్నవి. భగవంతుడుదప్ప మరెవ్వరు ఆ బాలను రక్షించ లేరు. నామాట విను"అని ఓదారుస్తున్నాడు. సముద్రయానము జేసిన రామన్నకు పడవ తీరముజేరడ మసంభవమని దెలుసు. పడవ మునిగి పోతుందే. అయ్యో విధీ" అంటూ నాల్గువైపులనుంచి కేకలొక్కమారుగా ముట్టాయి.

"నన్ను యింకా పట్టుకుంటావేమి తాత! నీకేమైనా మతి బోయిందా? చెల్లి చచ్చిబోతుంది. చూడు చూడు పడవ మునిగిపోతున్నది నన్నువిడు" అంటూ ఉరికాడు సుందరుడు. తీరాన ప్రజలు హాహాకారాలు జేస్తున్నారు.

సుందరుడు పుట్టినది మొదలు సముద్రముతో చెలగాటములాడిన వాడు గాబట్టి చేపపిల్లలా సముద్రములోనికి జొచ్చుక పోయాడు. విధి విలాసాలు దుర్జ్ఞేయములు గదా. ఇంకెంతో, దూరములేదు. మునిగి బోయే పడవను జేరుచున్నాడు. భయపడవద్దని చేతులెత్తి చెల్లెలి కభయ మిస్తున్నాడు. శ్యామల తన అన్నయ్యను గుర్తించింది. "అన్నా! వద్దు, వద్దు. నా కొరకు నీవు గూడ చావవద్దు. నిన్నుజూచానురా యిక నాకు కోరికలు లేవు. నీవు ముందుకు రావద్దు" అంటూ పిచ్చిదానిలా కేకలువేసింది కాని సముద్రుడు ఆమె మాటలు సుందరునికి వినిపించ కూడదనే పట్టు బట్టినాడు. ప్రళయనినాదములో క్రుంగిపోయింది నావ. సుందరుని ఆశలు నిరాశలై బోయినవి. తలపై పిడుగుబడినగి.

(తరువాయి 40వ పేజీలో)

"నీవు లేకుండా నేనుతీరము జేరను చెల్లీ. నీవు ఎక్కడున్నావూ" అంటూ పడవ మునిగినవైపు యీదుచున్నాడు సుందరుడు. బ్రద్దలైన పడవకుజెందిన కఱ్ఱలు పలకలు స్వేచ్ఛగా తేలిపోతున్నాయి. ఒక పలక కంటిబెట్టుకొని యెవరో తేలిపోవుట చూచాడు. దగ్గరకు వెళ్ళి పరిశీలించి చూడ ఒక స్త్రీమూర్తి కొంగుతో పలకను జుట్టుకొని తేలుచున్నది.

"దేవుడు దయామయుడు చెల్లీ. నా ప్రేమ ఫలించింది. నిన్ను పిన్నికియిచ్చే అవకాశం భగవంతు డిస్తాడనుకోలా" అంటూ క్షీణించిన స్వరముతో తీరానికేసి బయలు దేరాడు సుందరుడు. సముద్రుడు శాంతించాడు. పలకను లేని ఓపిక దెచ్చుకొని ముందుకు త్రోసుకొంటూ వచ్చుచున్న సుందరుని గుర్తించారు తీరానప్రజలు. బిడ్డలరాకను చూచారు తల్లులు. దయచూపిన ఒక అల వారిని తీరము జేర్చినది. పరుగు పరుగునజేరి పలుకరించారు గాని యేమున్నది! పడవ మునిగినపుడే శ్యామల ప్రాణం అన్నయ్యకు జెప్పకుండా వెళ్లిపోయింది. కళ్లువిప్పి చూచాడు సుందరుడు. తానిచ్చిన చిన్న బొమ్మను మెడలోని గొలుసులో వేసుకొనియున్నది. ఆ బొమ్మను ఒక చేతతో పదిలముగా బట్టుకొని రెండవ చేతిని పలకమీద ఆనించి నిద్రబోవుచున్నది తనముద్దుచెల్లెలు. రెండశ్రుబిందువులు రాలాయి పాపము యువకుని కళ్లనుంచి. ఇంతలోనె "ఇంకేమి చెల్లాయిరా నాయనా" అన్న మాటలువినవచ్చాయి. "చెల్లాయి మనలను మోసము జేసి వెళ్ళిబోయిందిరా తండ్రీ" అన్నారు మరల.

"అమ్మో! చెల్లీ!" అంటూ సుందరుని ప్రాణం శ్యామలను వెదుకుచూ బయలు దేరింది.

వారి అమరప్రేమనుచూచి లోకం నీరైపోయింది. భగ్నహృదయులైన ఆ తల్లులు వారికి సమాధులు గట్టించారు. శోకమూర్తులై వాటివద్దనె కాలక్షేపంజేసి ఒకనాటికి వారి ముద్దుబిడ్డలను జేరారు. వారుబోయారుగాని ఆ మధురప్రేమ చిహ్నంగా ఆ సమాధులే మిగిలాయి. క్రూర సముద్రుడు యిప్పుడు దుఃఖిస్తూ కెరటాల కన్నీటితో వారి పాదాలకభిషేకము జేయుచున్నాడు.

★